క్లుప్తంగా

'మా- ఏపీ' జిల్లా గౌరవాధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



నెల్లూరు(బృందావనం) : మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ -ఆంధ్రప్రదేశ్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడిగా అమరావతి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా దోర్నాల హరిబాబును నియమించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సినీనటుడు గౌతంరాజు తెలిపారు. ఇస్కాన్‌సిటీలోని 25 కళా సంఘాల స్టూడియోలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గౌతంరాజు పలువురికి నియామక పత్రాలు అందజేశారు. 'మా-ఏపీ' అసోసియేషన్‌ను 2021లో ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లు జరగాలనేది తమ ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో 25 కళాసంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల, తెలికుల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు



గ్రోసు సుబ్బారావును సన్మానిస్తున్న సంఘీయులు

నెల్లూరు(బృందావనం) : రాష్ట్రంలో గాండ్ల, తెలికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత గ్రోసు సుబ్బారావు తెలిపారు. స్థానిక మినీబైపాస్ రోడ్డులో ఉన్న పరమేశ్వరి కల్యాణ మండపంలో అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాండ్ల- తెలికుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యాపరమైన అభివృద్ధికి సీఎం చంద్రబాబు తగిన తోడ్పాటు అందించాలన్నారు. గాండ్ల, తెలికుల కార్పొరేషన్ను మంజూరు చేయాలని విన్నవించారు. ఆ సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం మాట్లాడుతూ సంఘీయుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘ నూతన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. చివరగా గ్రోసు సుబ్బారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, కోశాధికారి గార్లదిన్నె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ బైక్ చోరీకి యత్నం

- దొంగకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : దుకాణం ఎదురుగా నిలిపిన బైక్‌ను దొంగచాటుగా తీసుకెళ్తున్న బిహార్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఓ వ్యక్తి పాల దుకాణానికి వెళ్లగా అతని బైక్‌ను బిహార్ వ్యక్తి స్టార్ట్ చేసి ముందుకెళ్లాడు. వెంటనే స్థానికులు గుర్తించి సదరు వ్యక్తిని వెంబడించి బైక్‌ను ఆపి దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల చాంపియన్‌గా సత్యసాయి జిల్లా



మూడో స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టు

కోవూరు : రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ మహిళల చాంపియన్‌గా సత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. మండలంలోని పాటూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం జరిగాయి. ఇందులో రెండో స్థానంలో వైఎస్సార్ కడప, మూడో స్థానంలో నెల్లూరు, నాలుగో స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. కార్యక్రమంలో ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు నాయుడు, నిర్వాహకుడు భీమతాటి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..?

- ఆస్పత్రి భవన సెల్లార్‌లో సీసీ కెమెరాల వైర్లు కట్
- కావాలనే పనిచేయనీయకుండా చేస్తున్న కొందరు వ్యక్తులు
- అంతా తెలిసినా పట్టించుకోని అధికారులు



ఆస్పత్రి నూతన భవనంలోని సెల్లార్

నెల్లూరు(అర్బన్) : వేలాది మందికి వైద్యం అందించే నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి) నూతన ఐపీ భవనంలోని విశాలమైన సెల్లార్ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ప్రచారం జోరందుకుంది. ఈ విషయం ఆస్పత్రిలోని ఉద్యోగుల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. సుమారు 2 ఎకరాలకు పైగా ఉన్న నూతన భవన సెల్లార్‌లో గతంలో కూడా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే వార్తలు గుప్పుమనడంతో శానిటరీ విభాగానికి ఏసీతో కూడిన ప్రత్యేక గదిని ఖాళీ చేయించేశారు. అనంతరం ఆ విశాలమైన సెల్లార్‌లో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న మానిటరింగ్ గదికి అనుసంధానం చేశారు.

పట్టించుకోని అధికారులు

సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. వీటి పనితీరును మానిటరింగ్ చేసే వ్యవస్థ ఉన్నప్పటికీ సెల్లార్‌లో అవి ఎందుకు పనిచేయడం లేదు.. అనే విషయాన్ని ఎవరూ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం సాయంత్రం 6 గంటల తర్వాత సాగుతోందని అక్కడి స్టాఫ్ పేర్కొంటున్నారు. సాయంత్రం 5 గంటలకు ఆస్పత్రిలోని ఉద్యోగులంతా ఇళ్లకు వెళ్లిపోతారు. అయితే పెండింగ్ వర్క్‌లు పూర్తి చేయాలనే ఉద్దేశంతో కొంతమంది ఆఫీస్ సమయం అయిపోయిన తర్వాత కూడా ఉంటున్నారు. చీకటి పడ్డాక అసాంఘిక కార్యకలాపా లకు పూనుకుంటున్నారు. ఇకనైనా ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలని, సీసీ కెమెరాలను సక్రమంగా పనిచేసేలా చూడాలని, అవసరమైతే అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సాటి ఉద్యోగులే డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షణ చేయిస్తాం



సెల్లార్‌లో సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయడం లేదో పరిశీలిస్తాం. విచారణ జరిపి కిందకు వంచేసిన వారిపై చర్యలు తీసుకునేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. మళ్లీ వాటికి మరమ్మతులు చేయించి పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.


– మడపర్తి శ్రీనివాసులు, ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ కో-ఆర్డినేటర్

ఉద్దేశపూర్వకంగానే..

- సెల్లార్‌లో ఉన్న సీసీ కెమెరాలు బాగున్నప్పటికీ అందుకు సంబంధించిన వైరింగ్‌ను కట్ చేసి అది కాస్త పని చేయకుండా చేశారు.
- అలాగే గ్రౌండ్ ఫ్లోర్ నుంచి సెల్లార్‌లకు వచ్చే చోటలోనికి ఎవరు వస్తున్నారో.. ఎవరూ వెళ్తున్నారో తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కెమెరాను చుట్టు పరిసరాలు కనిపించకుండా నేలకేసి వంచి ఉంచారు.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో ఐసీయూ కెళ్లే లిఫ్ట్ ఎదురుగా ఉన్న మెట్ల నుంచి సెల్లార్‌కు వెళ్లేందుకు మరో మార్గం ఉంది. అక్కడ కూడా సీసీ కెమెరాను కిందకు వంచేసి ఎవరు వస్తున్నారో.. ఎవరు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితిని కల్పించారు. అక్కడ 10 సీసీ కెమెరాలు ఉంటే వాటిలో ఆరింటిని పనిచేయకుండా చేశారు. మరో నాలుగు పని చేస్తున్నప్పటికీ అవి వేరే మార్గంలో ఉన్నాయి. అవి సెల్లార్‌లో ఉన్న స్థలంలో పది శాతాన్ని కూడా కవర్ చేయడం లేదు. ఇలా సీసీ కెమెరాలను నిర్వీర్యం చేసి ఓ ముగ్గురు, నలుగురు ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి.



సెల్లార్‌లోకి వెళ్లే చోట కిందకు వంచేసిన సీసీ కెమెరా



వైర్లు కట్ చేసి విద్యుత్ సరఫరా లేకుండా చేసిన సీసీ కెమెరా



సెల్లార్ లోపల కిందకు వంచి ఉన్న సీసీ కెమెరా

సూర్యఘర్ పథకంపై ముమ్మర ప్రచారం



గాంధీ గిరిజన కాలనీలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పీఎం సూర్యఘర్ పథకంపై విద్యుత్‌శాఖ అధికారులు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. వెంకటేశ్వరపురం సెక్షన్ కార్యాలయ పరిధిలో ఎస్టీలు అధికంగా ఉండే గాంధీ గిరిజన కాలనీలో విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రఆచారి ఆధ్వర్యంలో సిబ్బంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు అవగాహన కలిగించడంతో పాటు, ఉచిత సోలార్ విద్యుత్ కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రఆచారి మాట్లాడుతూ, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్న వారిని గుర్తించి, సౌర విద్యుత్ వినియోగంతో వచ్చే ఆర్థిక ప్రయోజనాల గురించి తెలియజేసి అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవకాశం లేనిచోట్ల ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



విశ్వసాయిలో..



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్) : స్థానిక చెముడుగుంటలోని జిల్లా సైన్స్ సెంటరులో జాతీయ గణిత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయులు కాలానుగుణంగా నిత్య విద్యార్థుల్లా ఉంటూ సమాజానికి ఒక దిక్సూచిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ నరసింహమూర్తి, ప్రధానోపాధ్యాయులు నాగేంద్రఆచారి పాల్గొన్నారు.

విశ్వసాయిలో..

స్థానిక మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో గణిత పితామహుడు ఆచార్య శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన క్రీస్తు గాన జయంతి



గాయక బృందంతో సంఘ నాయకులు



క్రీస్తు గానం ఆలపిస్తున్న సంఘీయులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డొనీహాల్లో ఆదివారం జరిగిన క్రీస్తు గాన జయంతి అలరించింది. కేఎస్ క్రిస్టోఫర్ సాహిత్యం అందించగా, గుర్రం సుధాకర్‌రావు, జమ్ముల జయకుమార్, జి.అరుణ్‌కుమార్, బిల్లీ శ్యాంసన్‌లు స్వరకల్పన, సంగీతం చేకూర్చారు. దారా సురేష్, రమేష్, శాంతి, ప్రకాష్, పీజే జోయల్‌శ్యామ్, ఖాదర్‌బాషా, సాయి వాద్య సహకారం అందించారు. సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యాంసన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సంగీత ఆరాధనలో రెవరెండ్ డాక్టర్ జొనాథన్ వాక్యోపదేశం చేశారు. కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, క్వైర్ డైరెక్టర్ బిల్లీ శ్యాంసన్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాఖ్యాతగా గంట థామస్ మౌంట్‌బాటన్, గాయక బృంద సభ్యులు బ్రదర్ జానిజో, మహేష్, దివాకర్, జి.ఆరోన్, చార్లెస్, వికాస్, సంతోష్, హుల్డా శ్యాంసన్, అనితారాయ్, సంధ్యా, జ్యోతిజయకుమార్, ఆషా, ప్రసూన, శ్వేతశ్యాంసన్ తదితరులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో చైర్మన్ డి.సురేంద్ర, కోశాధికారి జీబీ విజయభాస్కర్, కార్యవర్గ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అరిగెపూడికి కళా నీరాజనం



ప్రతిభ చూపిన చిన్నారులకు సన్మానం



పాటలు పాడుతున్న గాయకులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో కళాబంధు అరిగెపూడి విజయకుమార్‌కు కళానీరాజనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత అరిగెపూడి విజయకుమార్, కృష్ణకుమారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాటలు, డ్యాన్స్ పోటీల విజేతలకు నగదు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. డేగల సాంబశివరావు ఆధ్వర్యంలో విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఆర్కెస్ట్రా రాజశేఖర్, సీనియర్ గాయకుడు పాటూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్వర రాజశేఖర్‌ను సన్మానించారు. వాకాటి విజయకుమార్‌రెడ్డి, వేలూరు ప్రదీప్, నాగినేని ప్రభాకర్, డేగల సాంబశివరావు, ఎన్వీ రమణయ్య, రామచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ గల 29 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. అలాగే మరో ఇద్దరు నిరుపేదలకు వైద్యం కోసం ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 31 మందికి రూ.10 వేల చొప్పున రూ.3.10 లక్షల నగదును అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ములుముడి ఉదయ్‌కుమార్, మేనేజర్ నరసింహం, కోశాధికారి శ్రీనివాసరావు, ఆడిటర్ సూర్యనారాయణ, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, డాక్టర్ వై.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ పీఎస్ కార్తీక్, డాక్టర్ చక్రధర్‌రావు, ఎ.జయప్రకాష్, మైపాడు రాజాశర్మ, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

నరసింహకొండకు చిన్న ఆండవన్ స్వామి



నెల్లూరు (సిటీ) : రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శ్రీరంగానికి చెందిన శ్రీమద్ పరవక్కొట్టై చిన్న ఆండవన్ స్వామి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన విద్యార్థులకు హయగ్రీవ స్తోత్రం, నరసింహ అవతారం గురించి వివరించారు. ధనుర్మాసంలో వేదగిరి క్షేత్రానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. చివరగా ఆయన్ను ఆలయ ఈఓ వేమూరి గోపి సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు భాస్కరాచార్యులు, కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, రాఘవాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్రెండ్స్ వాకర్స్' నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ 2025 నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శిగా గువ్వల నారాయణ రెడ్డి, కోశాధికారిగా మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా తలపనేని హరిబాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వినుకొండ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, నసీర్ అహ్మద్, సుబ్బరాయుడు, పలగాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అద్వైత భారత్ పుస్తకావిష్కరణ



రచయిత చెంచుసుబ్బయ్యను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

నెల్లూరు(బారకాసు) : పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో చతుర్వేదుల చెంచు సుబ్బయ్య రచించిన అద్వైత భారత్ అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక రేబాలవీధిలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అవారు శ్రీధర్‌బాబు పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయిత మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప ఆశయంతో ఉన్న మన దేశంలో కల, మత, ప్రాంతీయ ద్వేషాలు ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు చేసే ప్రయత్నమే ఈ నవల అని పేర్కొన్నారు. ఇందులో కార్యదర్శి టి.సులోచన, మోపూరు పెంచల నరసింహం, అన్నం శివకృష్ణ, మక్తాల నరేంద్ర, కూని అంకబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజోత్సవాల్లో భాగంగా హోమాలు, సహస్ర కలశాభిషేకం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం, మహాగణపతి హోమం, శీవేలి ఉత్సవం, మహాదీపారాధన, భగవతిసేవ, అత్తాళపూజ, పడి కర్పూరం, హరివరాసనం తదితరాలను ఘనంగా జరిపించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా కేటీఎం వెంకటేశ్వర్లు, ఎమ్మార్ రాజీవ్ హారిక, మాలెం మధుసూదన్‌రెడ్డి, ఆశ, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నిరోష వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్పసేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కేజీ శంకరన్, దేవళ్ల శ్రీధర్‌రెడ్డి, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

నారాయణలో సక్సెస్ మీట్



సక్సెస్ మీట్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

నెల్లూరు (టౌన్) : స్థానిక నారాయణ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నీట్ సక్సెస్ మీట్- 2024ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్‌లో ర్యాంకులు సాధించి మెడికల్ సీట్లు పొందిన విద్యార్థులను సత్కరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మకమైన మెడికల్ కళాశాలల్లో తమ విద్యార్థులు సీట్లు పొందడం గర్వంగా ఉందన్నారు. 2024లో 350 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించారన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నారాయణ జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, డీన్ వర్ధిని తదితరులు పాల్గొన్నారు.